క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌ను కలిసిన వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని వీసీ కె.ఆర్.రజిని కోరారు. అమరావతిలో శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌ను కలిసి వర్సిటీ ఆర్థిక సమస్యలు వివరించారు. ఆర్థిక వనరులు తక్కువ ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. త్వరలో వర్సిటీ పాలక మండలి సమావేశం నిర్వహించాలని కోరారు. పీఎం ఉషా (ప్రధాన మంత్రి ఉచ్చతార్ శిక్ష అభియాన్) నిధులు ప్రతిపాదనలు, భవిష్యత్తులో ఖర్చు చేసేందుకు చేసిన ప్రతిపాదనలు వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



బాలికలతో మాట్లాడుతున్న రిటైర్డ్ కలెక్టర్ గగారిన్

రణస్థలం: బాలికలు చదువుతో పాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ కలెక్టర్ గగారిన్ అన్నారు. కొండములగాం ఆదర్శ పాఠశాలలో శుక్రవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువుకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని, ఎవరైనా బడి మానేసి ఉంటే వారు తిరిగి చదువుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎ.త్రినాథరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం: నగరంలో 80 అడుగుల రోడ్డులోని హోటళ్లు, రెస్టారెంట్లను జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి నిర్వాహకులకు పలు సూచనలు జారీ చేశారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి కె.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందించాలని వినతి



కలెక్టర్‌కు కలిసిన సాయిబాబునాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే పథకాలు జిల్లాలో ఉన్న తూర్పు కాపు కులస్తులకు కూడా వర్తింపజేయాలని తూర్పుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబునాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి విన్నవించారు. జిల్లాలో తూర్పు కాపులు అధిక సంఖ్యలో ఉన్నా ఇప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న తూర్పుకాపులను ఆదుకోవాలని ఆయన కోరారు.

పూర్తి సమాచారం అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్ : మండల సమాఖ్య కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో సమాచారం ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య జిల్లా స్థాయి కంప్యూటర్ ఆపరేటర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల బలోపేతంలో కంప్యూటర్ ఆపరేటర్ల పాత్ర కీలకమని చెప్పారు. జిల్లా, మండల, గ్రామ సమాఖ్యలు బలోపేతం కావాలన్నారు. అర్హత మేరకు రుణాలు తీసుకోవడం, చెల్లించడం, ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవడం కీలకమని చెప్పారు. గ్రామం యూనిట్‌గా అన్ని సంఘాల లావాదేవీల వివరాలు మండల సమాఖ్య కార్యాలయాల్లో కంప్యూటరీకరణ జరగాలన్నారు. కార్యక్రమంలో సంస్థాగత నిర్మాణం డీపీఎం మోహనరావు, ఏపీఎం భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనులకు మోక్షమెప్పుడో?



బొంతలకోడూరులోని మల్లిపెద్దివాని చెరువు

- బొంతలకోడూరులో ఉపాధి పనులు అడ్డుకుంటున్న కూటమి నేతలు
- పరిరక్షించాలని కోరుతున్న స్థానికులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బొంతలకోడూరు గ్రామ సమీపంలో మల్లిపెద్దివాని చెరువుపై టీడీపీ నాయకుల కన్నుపడింది. గతంలో ఒకసారి ఆక్రమణకు ప్రయత్నించినా స్థానిక నాయకులు, అడ్డుకోవడంతో తాత్కాలికంగా ఆక్రమణల పర్వానికి అడ్డుపడింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి చెరువు ఆక్రమణకు ప్రయత్నాలు సాగిస్తున్నారని, దీనిలో భాగంగానే చెరువు పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 39 ఉన్న ఈ చెరువు విస్తీర్ణం 2.61 ఎకరాలు.

సమగ్ర సర్వే జరిగినా..

ఆరేళ్ల క్రితం చెరువు ఆక్రమణలకు ప్రయత్నాలు జరగడంతో సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు, స్థానిక రైతులు కలిసి అప్పట్లో జిల్లా స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సమగ్ర సర్వేకు ఆదేశించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. ఆక్రమణలకు అవకాశం లేకుండా చెరువును పరిరక్షించారు. 2023 మార్చిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువు అభివృద్ధికి రూ. 9 లక్షలు మంజూరు చేశారు. హద్దుల మేరకు ఎర్త్ పని చేసి గట్లు నిర్మించారు. రూ.4.50 లక్షల విలువైన పనులు పూర్తిచేశారు. ఇంకా రూ. 4.50 లక్షల పనులు నిర్వహించాల్సి ఉంది. ఇంతలో ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రస్తుతం ఈ పనులు జరగకుండా కూటమి నాయకులు అడ్డుకుంటున్నారు. చెరువు సర్వే నంబర్ వ్యక్తుల పేరిట ఉందని చెబుతూ పనులు అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంతో శ్రమించి రెవెన్యూ అధికారులు చేసిన సర్వేను మళ్లీ మార్చాలని ప్రయత్నిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. అధికారులే రంగంలోకి దిగి చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీ, రైతులు ఇటీవల జిల్లా గ్రీవెన్స్‌సెల్‌లో సైతం ఫిర్యాదు చేశారు.

చెరువును కాపాడాలి..



గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువును అధికారులే కాపాడాలి. మిగులు నిధులు రూ. 4.50 లక్షలతో ఉపాధి పనులు మళ్లీ ప్రారంభించాలి. గట్టు పని చేయించి తుప్పలు తొలగిస్తే చెరువు లోపల షిల్టు తీసేందుకు వీలవుతుంది.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

ఆక్రమణలకు ప్రయత్నం..



పదేళ్లగా చెరువును ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చెరువును రక్షించుకున్నాం. మళ్లీ కూటమి నాయకుల కళ్లు పడ్డాయి. పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు. సర్వే నంబర్ మార్పుకు సైతం ప్రయత్నిస్తున్నారు.

– మాడుగుల జగదీశ్వరరావు, ఎంపీటీసీ, బొంతలకోడూరు

అధికారుల సూచనల మేరకే..

ప్రస్తుతం చెరువులో నీరు ఉంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు నిర్వహిస్తాం. గతంలో రూ.4.50 లక్షలు పనులు చేశారు. వాతావరణం అనుకూలించక మిగతా పనులు ముందుకు సాగలేదు.

– శోభాదేవి, ఉపాధి ఏపీఎం

ధాన్యం లెవీ సేకరణ లక్ష్యాన్ని పెంచాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



మండల సర్వసభ్య సమావేశంలో ధాన్యం సేకరణపై చర్చిస్తున్న సభ్యులు

గార: 2024–24 ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యం లెవీ సేకరణ గడువు పెంచాలని, గతేడాది మాదిరిగానే రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. శుక్రవారం గార మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ జిల్లా లెవీ సేకరణ లక్ష్యమున్నా, మండలానికి కావలసిన లక్ష్యమున్నా ఎవరో మెప్పు కోసం ఆపేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌కు పలువురు రైతులు సమస్యను తెలియజేశారని, ఉన్నతాధికారులతో పాటు జేసీ దృష్టికి ఆయన సమస్య తీసుకెళ్లారని టీడీపీ ఎంపీటీసీ సభ్యులు గొండు భాస్కరరావు తెలియజేసారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్రీదీప్తి మాట్లాడుతూ ఈ ఏడాది 30వేల టన్నుల లెవీ లక్ష్యం పూర్తయిందని, ధాన్యం సేకరణ పెంచమని నివేదించామని చెప్పారు. కొర్లాం సర్పంచ్ పీస శ్రీహరిరావు మాట్లాడుతూ గతేడాది 40 వేల టన్నులు లక్ష్యం ఇచ్చారని, ఈ ఏడాది డిసెంబర్‌లో అకాల వర్షాలు కురవడంతో రైతులు అవస్థలు పడ్డారని, ప్రభుత్వం సహకరించకపోగా, లక్ష్యాన్ని కుదించడం భావ్యం కాదన్నారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెబుతూనే కేంద్ర ప్రభుత్వం సూచించిన ఆధార్ విత్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకుని కొత్త నెంబరును రైతులు తీసుకోవాలని సూచించారు. యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారని యాళ్ల నారాయణమూర్తి తెలిపారు.

పీఎం సూర్యఘర్ పథకానికి 10 ఎకరాల వరకు భూమి అవసరమని ఏఈ కమలహాసన్ కోరగా.. అంపోలు, బీచ్ ఏరియాలో ఎక్కువ ప్రభుత్వ భూములున్నాయిని పలువురు సభ్యులు సూచించారు. ఇంటిపైనా సూర్యఘర్ ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నామని ఏఈ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, అరవల రామకృష్ణ, పీస గోవిందరాజులు, కొయ్యాన నాగభూషణం, చల్ల శ్రీనువాసరావు, ఎస్ఐ ఆర్.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మేట్‌లుగా టీడీపీ కార్యకర్తలను నియమించడం తగదు



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పంచాయతీలో ఉపాధి హామీ పథకం మేట్‌లుగా టీడీపీ కార్యకర్తలను నియమిస్తే సహించేది లేదని సర్పంచ్ అల్లు కన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఎచ్చెర మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీఎస్ రామ్మోహన్, ఉపాధి ఏపీవో శోభాదేవి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ప్రస్తుత మేట్‌లను తొలగించి టీడీపీకి అనుకూలంగా ఉన్న వారిని నియమించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అర్హులందరికీ ఉపాధి పని కల్పించాలని, గ్రామసభ తీర్మానం మేరకు పనులు నిర్వహించాలన్నారు. సర్పంచ్‌లకు తెలియకుండా, కూటమి నాయకుల కనుసన్నల్లో ఉపాధి పనులు చేస్తే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు సూర్యనారాయణ, అరసవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 57.95 శాతం, మూడో సెమిస్టర్‌లో 74.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సెమిస్టర్ బీఏ 37.41శాతం, బీ.కాం 50.31 శాతం, బీఎస్సీ71.90 శాతం, మూడో సెమిస్టర్ బీఏ 70.71 శాతం, బీకాం 79.28 శాతం, బీఎస్సీ 73.28 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ సీహెచ్ కాత్యాయని, కె.సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



శ్రీకాకుళం అర్బన్: సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



శ్రీకాకుళం: సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళిత సంఘ నేతలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భూసంస్కరణలు, నూతన పరిశ్రమలు, బాలికలకు మొదటిసారి పాలిటెక్నిక్ కాలేజీలు, వృద్ధాప్య పెన్షన్లు తీసుకొచ్చిన నేతగా సంజీవయ్య గుర్తింపు పొందారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదన్‌రావు, గంగు కొండలరావు, సోడవరం చంద్రరావు, అంబటి లక్ష్మణరావు, సోడవరం లీలావతి, సురియా బేగం పాల్గొన్నారు.

శ్రీకాకుళం: విలువలకి ప్రతిరూపం దామోదరం సంజీవయ్య అని దళిత నాయకులు టి.శ్రీను, కె.వేణు, వై.గురుమూర్తి అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న సంజీవయ్య పార్కులో సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బడియా కామరాజు, అర్జి కోటి, పురుషోత్తం రాంబాబు, పెయ్యల చంటి, అప్పారావు, రాజేశ్వరీ, కళ్యాణ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో విచారణ



విచారణ చేపడుతున్న చంటిబాబు

జి.సిగడాం: జి.సిగడాం సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో శుక్రవారం సబ్ డివిజనల్ సహకార అధికారి ఎం.చంటిబాబు, అసిస్టెంట్ సహకర అధికారి ఎం.శ్రీనివాస్ సమగ్ర దర్యాప్తు చేపట్టారు. సొసైటీలో అవినీతి జరిగిందని, ఖాతాదారులతో విచారణ చేయించాలని నిద్దాం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మీసాల రవి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నామని విచారణాధికారి చంటిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అధికారి పి.జానకిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



గారలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

గార: వ్యవసాయ రంగాన్ని పూర్తి ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో అందించనుందని ఏఈవో శ్రీదీప్తి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గార పంచాయతీకి సంబంధించి నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కలిగిన రైతులు ఆధార్, ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకం, వన్‌బీ, ఆధార్‌తో లింకు కలిగిన ఫోన్ నంబరును పట్టుకొని రావాలని సూచించారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద కూడా రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) కోసం నమోదు చేయించుకోవచ్చన్నారు.

నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అరసం అధ్యక్షుడు నల్లి ధర్మారావు, కార్యదర్శి చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, పునర్వికాస ఉద్యమం రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్, అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతిశ్రీ, సాహితీ ప్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, విద్యావేత్త బలివాడ మల్లేశ్వరరావు, విద్యాసంస్థల అధినేత జామి భీమశంకరరావు, చిట్టి నాగభూషణం, నటుకుల మోహన్, ఎం.వి.మల్లేశ్వరరావు హాజరవుతారని పేర్కొన్నారు. గ్రంథాలయ అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

జి.సిగడాం: ఉపాధి పనులకు సంబంధించి గ్రామాల్లో పకడ్బందీగా సామాజిక తనిఖీలు చేపట్టాలని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి వేతనాలు, బిల్లుల చెల్లింపును క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ పున్నాంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పిక్కలు సరే.. పనులెప్పుడు?



ఎచ్చెర్ల నుంచి చినరావుపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మూడు కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారిలో గోతులు ఏర్పడ్డాయి. మరమ్మతుల కోసం ఇరువైపులా పిక్కల లోడ్‌లు వేసినా పనులు చేపట్టలేదు. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైకి పిక్కలు రావటంతో టైర్లు జారుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

మూన్నాళ్ల ముచ్చటేనా?



రథసప్తమి సందర్భంగా అరసవల్లి మిల్లు జంక్షన్‌లో సూర్యనమస్కారాల విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన పచ్చటి గడ్డి నీరులేక ఎండిపోతోంది. నిర్వహణ లేమి కారణంగా ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు మండిపడుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నిరుపయోగంగా మరుగుదొడ్లు



ఎచ్చెర్ల మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. తలుపులు చెదలు పట్టేసి పూర్తిగా పాడయ్యాయి. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నిర్వహణను గాలికొదిలేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పట్ట పగలే విద్యుత్ వెలుగులు



మండల కేంద్రమైన గారలో సీఎస్పీ రోడ్డులో కొన్ని రోజులుగా విద్యుత్ లైట్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఇదే పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

– గార

ఎఫ్‌డీఐ ప్రతిపాదన రద్దు చేయాలి



ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర బడ్జెట్లో ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించాలని ఆర్థిక మంత్రి చేసిన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. ఈ మేరకు శ్రీకాకుళం ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు కె.నారాయణ, కేతవరపు శ్రీనివాసు తదితరులు మాట్లాడుతూ ఎఫ్‌డీఐ పెంపు దేశ ప్రయోజనాలకు, పాలసీదారుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలగజేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికే 74శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఇచ్చినప్పటికీ 32% మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని, ఈ స్థితిలో 100 శాతం ఎఫ్‌డీఐ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పాలసీదారుల డబ్బును లాభాపేక్షతో విదేశీ కంపెనీలు తమ దేశాలకు తరలించుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఎల్‌ఐసీలో వెంటనే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, జీఐసీ ఉద్యోగుల వేతన సవరణ వెంటనే చేపట్టాలని నినదించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.ప్రభాకర్ రావు, బి.శివాజీ, కె.రమేష్‌కుమార్, ఎంవీ కామేశ్వరరావు, డి.అచ్యుతరావు, జేఎల్ పరిమళ, పీటీఎస్ మూర్తి, బీవీఎల్ శశిధర్, ఎ.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మకు ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధి కామాక్షమ్మ పీఠంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు వేదుల వేంకట సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీచక్రార్చన, అభిషేకాలు జరిగాయి. అనంతరం పుష్పార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పుష్పార్చన

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా జానకి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా జానకి విధుల్లో చేరారు. ఈమె విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఉడా)లో పనిచేసి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన వరహాలబాబు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఈమె చేరారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేదిశగా చర్యలు చేపడతామన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.